గూడెంలో వైభవంగా వైశాఖ పౌర్ణమి

• పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం • సామూహిక సత్యనారాయణ వ్రతాలు

సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, మే23 : దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం వైశాఖ పౌర్ణమి జాతర వైభవంగా సాగింది. ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న భక్తులు సమీప గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. గుట్టపైనున్న సత్యదేవుడిని దర్శించుకున్నారు. విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో భక్తులు ఉదయం వేళ పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేల సంఖ్యలో హాజరైన భక్తులకు ఆలయ అధికారులు సౌకర్యాలు కల్పించారు. పలువురు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. దర్శనం అనంతరం భక్తులు స్వామి వారి తీర్థ.. ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితులు, ముఖ్య అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవం

బ్రహ్మోత్సవంలో పాల్గొన్న సింగరేణి మందమర్రి ఏరియా జీఎం మనోహర్ సవిత దంపతులు

మందమర్రి,మే23 : మందమర్రిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఐదో రోజూ స్వామి వారి బ్రహ్మోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్, సవిత మనోహర్ ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతి, చక్రతీర్థం కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానంలో కొత్తగా నిర్మించిన కోనేరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఈఅండ్‌ఎం నాగరాజు, డీజీఎం సివిల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను సందర్శించిన ఎస్ఈ

ఆసిఫాబాద్ టౌన్, మే 23 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలను గురువారం విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్ సందర్శించారు. వైద్య కళాశాలలో ఉన్నటువంటి కాలేజీకి సంబంధించిన సర్వీస్ కనెక్షన్, జనరేటర్‌ను పరిశీలించి ప్రిన్సిపాల్‌కు అవసరమైన సూచనలు చేశారు. అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్ సదాసివ్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సూచనలు ఇస్తున్న ఎస్ఈ వాసుదేవ్

సింగరేణి సీఎండీతో ఆస్ట్రేలియా టీఐ కమిషనర్ భేటీ

సీఅండ్‌ఎండీ బలరామ్‌తో ఆస్ట్రేలియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డెనిస్ ఈటెన్ భేటీ

శ్రీరాంపూర్, మే 23 : సింగరేణి సంస్థ రానున్న ఐదేళ్లలో నిర్దేశించుకున్న 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనకు అవసరమైన ఆధునిక మైనింగ్ టెక్నాలజీ, శాస్త్ర సాంకేతిక విషయాల్లో సహకారం అందించే విషయమై ఆస్ట్రేలియా దేశ ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డెనిస్ ఈటెన్... సంస్థ సీఎండీ ఎన్ బలరామ్‌తో గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ బలరామ్ మాట్లాడుతూ ప్రస్తుతం సింగరేణిలో ఉపయోగిస్తున్న సాంకేతికత, ఈ ఏడాది సాధించిన రికార్డు ఉత్పత్తి, రవాణా, టర్నోవర్, సంస్థ వృద్ధిరేటును వివరించారు. అలాగే బొగ్గు ఉత్పత్తితో పాటు వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా థర్మల్, సోలార్ రంగాల్లోకి సంస్థ విజయవంతంగా అడుగు పెట్టిందని వివరించారు. వ్యాపార విస్తరణలో భాగంగా ఇతర రంగాల్లోని అవకాశాలను పూర్తిగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఆస్ట్రేలియా దేశానికి చెందిన సింటార్స్ తదితర సంస్థలతో మైనింగ్, రక్షణ, సాంకేతిక విషయాల్లో సేవలు స్వీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. సింగరేణిలో అమలవుతున్న సాంకేతికతను, సంస్థ చేపడుతున్న నూతన వ్యాపార విస్తరణ చర్యలను స్వయంగా చూసేందుకు నవంగరులో ఆస్ట్రేలియా బృందం సింగరేణి ప్రాంతంలో పర్యటించనుందని ఆస్ట్రేలియా కమిషనర్ డెనిస్ ఈటెన్ వివరించారు. అలాగే మైనింగ్ రంగంలో నూతన సాంకేతికతలపై తమ దేశంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ ప్రగతికి దోహదపడే అంశాలపై తగిన సహకారాన్ని అవసరమైనప్పుడు స్వీకరిస్తామని సీఎండీ బలరామ్ పేర్కొన్నారు. ఆయన వెంట బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ రామకృష్ణ దస్త్రాల ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పరీక్షా కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లను పరిశీలిస్తున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఐఈవో శంకర్

ఆసిఫాబాద్ టౌన్,మే 23 : జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 24 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 8 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 2989 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు డీఐఈవో తెలిపారు. గతేడాదితో పోల్చితే ప్రస్తుతం రెండు సెంటర్లు అదనంగా పెంచారు. కాగా, ఇంటర్ పరీక్షలకు ఒక్క నిమిషం నిబంధన తొలగించారు. ఐదు నిమిషాల వరకు లోనికి అనుమతి ఇవ్వనున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచే కేంద్రంలోకి అనుమతించనున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నెట్ బాల్ జట్ల ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డిస్ట్రిక్ట్ యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ రమాదేవి

ఆసిఫాబాద్ టౌన్, మే 23 : జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని డిస్ట్రిక్ట్ యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ రమాదేవి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మెన్,ఉమెన్ నెట్ బాల్ ఎంపిక పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పెరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ హైమద్, పీడీ తిరుపతి, పీఈటీ హరీశ్, ప్రభాకర్, రాకేశ్, గురువేందర్,యోగి, కిరణ్ ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్కే న్యూటెక్ గని ఉత్పత్తి కాలం పెంపునకు కృషి

• కార్మికుల సమస్యలు పరిష్కరించాలి • ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్ ఆర్కే న్యూటెక్ గనిపై మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, మే 23 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే న్యూటెక్ గని ఉత్పత్తి జీవిత కాలం పెంపునకు కృషి చేస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం ఆర్కే న్యూటెక్ గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల ఆదాయ పన్ను రిటర్న్ దాఖలు సమయం పొడిగించాలని డిమాండ్ చేశారు. ఐటీ ఆప్షన్ పాత పద్ధతిని, లేక కొత్త పద్ధతిని కొనసాగించడానికి గనులపై కార్మికుల అంగీకార పత్రాలు ఇవ్వాల్సి ఉందని, కానీ యాజమాన్యం ఈ విషయాన్ని కార్మికులకు తెలపడంలో జాప్యం చేసిందన్నారు. దీంతో అంగీకార పత్రం ఇవ్వలేక పోయారని తెలిపారు. గడువు మరింత పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ యాజమాన్యంతో ఎప్పటికప్పుడు చర్చించి పరిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, సంఘం సదానందం, రాంచందర్, రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులూ గజ్జి రమేశ్, సందీప్, చంద్రమౌళి, అక్రం పాషా, రాజయ్య, సిద్దం అజయ్, శ్రీకాంత్, షాకీర్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, మే 23 : శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్‌అండ్‌పీసీ కార్యాలయం వద్ద హాల్ నిర్మించాలని, డ్యూటీ స్థలాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఐకే ఓసీపీ వద్ద ఉన్న చెక్‌పోస్టు కంటైనర్ చెడిపోయిందని, వెంటనే నూతన గది నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎస్సార్పీ-1గని వద్ద గార్డ్ రూంలు నిర్మిచాలన్నారు. ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది ఇతర విధులకు వెళ్తే ఆన్‌డ్యూటీలుగా పరిగణించాలని కోరారు. జనవరి 26న సిబ్బందికి పీహెచ్‌డీ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎస్‌అండ్‌పీసీ పిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌అండ్‌పీసీ డిపార్ట్‌మెంట్ ఐఎన్‌టీయూసీ నూతన పిట్ కమిటీని నియమించినట్లు ఉపాధ్యక్షుడు శంకర్ రావు పేర్కొన్నారు. పిట్ కార్యదర్శిగా ఎండీ గులాం మోయినొద్దీన్, సహాయ కార్యదర్శిగా పోలం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా కేఎస్ చక్రధర్, ప్రచార కార్యదర్శులుగా పూదరి సాంబయ్య, సత్యనారాయణ, సలహాదారులుగా ఎం ఆంజనేయులు, కపీ విజయ్‌కుమార్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. అలాగే షిఫ్ట్ కార్యదర్శులుగా ఏరిలేకు బండ రవీందర్, మొగిలి సదానందం, రాంశెట్టి సతీశ్‌కుమార్, బీ రిలేకు పాదం రవి, గడమల్ల శ్రీనివాస్, గంజి రాంగోపాల్, డీకొండ స్వామి, మాడగోని శ్రీనివాస్, జనరల్ షిఫ్ట్‌కు పుట్ట తిరుపతిని నియమించిట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణ శ్యాంకుమార్ పాల్గొన్నారు.